సాక్షి మంచిర్యాల

గురువారం । 19 । డిసెంబర్ । 2024



టీచర్లపైనే భారం..!

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 430 టీచర్లు, ఆయాల పోస్టుల ఖాళీలతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆటపాటలతో కూడిన విద్య అందించడంలో ఆటంకం ఏర్పడుతోంది. 9లో▸



కార్మికుల వేతనాలు పెంచాలి

సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. రామకృష్ణాపూర్‌లో బుధవారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0 /15.0

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

చలి.. జర జాగ్రత్త



మంచిర్యాలటౌన్: జిల్లాలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 11డిగ్రీలకు పడిపోతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరుగుతోంది. చలితో చర్మం పొడిబారి పగుళ్లు రావడతోపాటు అలర్జీ, చర్మం ఎర్రబడడం, దురద వంటి శీతాకాలపు చర్మవ్యాధులు, అస్తమా వ్యాధిగ్రస్తులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో సతమతం అయ్యే అవకాశం ఉంది. చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు సూచనలు చేస్తున్నారు.

- వివరాలు 8లో▸


చిన్నారులు రక్షణ పొందాలి



దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, చిన్నారులు, వృద్ధులు చలిగాలుల నుంచి రక్షణ పొందడంతోపాటు గాలి నేరుగా తగలకుండా చూసుకోవాలి. చలిగాలులు వీస్తున్నప్పుడు ఇంటి తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి. శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా ఉండేలా పొడి దుస్తులు, ఊలు స్వెట్టర్లు ధరించాలి. చలి తీవ్రత కారణంగా అన్ని వయసుల వారితోపాటు పిల్లల్లో జలుబు, దగ్గు, జ్వరం తదితర సమస్యలు ఎక్కువగా ఉంటాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురైతే వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి. నెలలోపు చిన్నారులకు స్నానం చేయించవద్దు. పిల్లలను వేడి గదుల్లో ఉంచాలి. కాటన్ దుస్తులు తొడిగి, చలిని బట్టి దుప్పట్లు కప్పాలి. పిల్లలను బైక్‌లపై ముందు కూర్చోబెట్టుకోవద్దు. ఫ్యాన్ కింద నేరుగా పడుకోబెట్టవద్దు.

– డాక్టర్ అభినవ్, ఎండీ జనరల్ ఫిజీషియన్, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

నీరు ఎక్కువగా తాగాలి



చలికాలంలోనూ తప్పనిసరిగా నాలుగు నుంచి ఐదు లీటర్లు నీరు తాగాలి. ఎక్కడికి వెళ్లినా మాస్క్ ధరించాలి. దుమ్ము, ధూళి పీల్చుకోకుండా చూడాలి. దైనందిన ఆహారం అనంతరం నువ్వులతో చేసిన పదార్థాలు తీసుకుంటే జీర్ణమవుతుంది. అన్ని రకాల డ్రైఫ్రూట్స్ తీసుకుంటే రక్తాన్ని శుద్ధి చేసి మనిషికి అవసరమైన శక్తిని ఇస్తాయి. చిలకడ దుంపలు ఉడికించి తింటే శరీరానికి కావాల్సిన వెచ్చదనం ఇస్తాయి. చలికాలంలో దగ్గు, జలుబు, వైరస్ వంటి ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయి. ఉసిరి కాయలను తీసుకుంటే సీ విమిన్, యాంటీ ఆక్సిడెంట్లు వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునేందుకు ఉపయోగపడుతాయి. అన్నం, కూరగాయలు, ఆకు కూరలతోపాటు వారానికి ఒకసారి జొన్నరొట్టె తింటే అందులో పుష్కలంగా ఉండే కాల్షియం వల్ల కండరాల కదలిక బాగా ఉంటుంది. ఫ్రిజ్‌లో పెట్టినవి, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినకుండా అప్పుడే వండిన వాటిని, వేడి వేడి ఆహారాన్ని తినడం చేస్తూనే బయట ఆహారానికి వీలైనంతగా దూరంగా ఉండాలి.

– డాక్టర్ హరీశ్‌రాజ్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్: సీఎం కప్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి సీఎం కప్–2024 బాక్సింగ్, కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధి కారి కీర్తిరాజ్ వీరు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈవో గణపతి పాల్గొన్నారు.

ఏఎంవీఐగా సూర్యతేజ బాధ్యతల స్వీకరణ



కే.సూర్యతేజ

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ)గా కే.సూర్యతేజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన ఏఎంవీఐలకు నియామక ఉత్తర్వులు అందజేసిన విష యం తెలిసిందే. మహబూబాబాద్‌కు చెందిన సూర్యతేజ మంచిర్యాల ఏఎంవీఐగా నియామకం అయ్యారు. ఉన్నతాధికారుల సహకారంతో వాహనదారులకు రవాణా సేవలు మెరుగ్గా అందేలా చూస్తానని తెలిపారు.

పోలీసుల తనిఖీలు



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న సీఐ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలో మంగళవారం అర్ధరాత్రి ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఆపరేషన్ ఛత్రలో భాగంగా ఐదుగురు సీఐలతో ఐదు బృందాలు ఏర్పాటు చేసి ప్రధాన చౌరస్తాలు, రహదారులపై అకారణంగా తిరుగుతున్న వారిపై కొరఢా ఝుళిపించారు. మద్యం సేవించి, ట్రిపుల్ రైడింగ్‌తో ద్విచక్రవాహనాలపై వెళ్తున్న సుమారు 100మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నమ్మదగిన సమాచారం లేకుండా 11గంటల తర్వాత రోడ్లపైకి వచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ ప్రమోద్‌రావు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, బెల్లంపల్లి సీఐ అబ్జల్ ఖాన్, ఎస్సైలు పాల్గొన్నారు.

బొగ్గు లారీ బోల్తా



బోల్తా పడిన బొగ్గు లారీ

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేడారం సమీపంలో బుధవారం రాత్రి బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. చంద్రాపూర్ నుంచి పాల్వంచకు వెళ్తున్న లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వల్లనే ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుపై లారీ బోల్తాపడడంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సార్లు లేరు..!

- విద్యార్థులు ఎక్కువ.. ఉపాధ్యాయులు తక్కువ
- ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కొరత

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధన, అభ్యసన ప్రక్రియకు విఘాతం కలుగుతోంది. ఏటా కోట్లాది రూపాయలతో మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా ఖాళీల భర్తీ విషయంలో స్పష్టత కొరవడుతోంది. ఏళ్ల తరబడి ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. అత్యవసర పరిస్థితుల్లోనూ సెలవు దొరక్కుండా పోతోంది. సెలవు, సమావేశాలకు వెళ్లిన చోట్ల మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో సరిపెడుతుండగా.. మరికొన్ని చోట్ల మూసి వేయడమో, విద్యార్థులే చదువుకుని వెళ్లడమో చేస్తున్నారు.

ఇవీ సమస్యలు..

ఒకటి నుంచి ఐదు తరగతులకు కలిపి 18 సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కరే ఉపాధ్యాయుడు బోధన చేస్తూ మిగతా పనులు చూసుకోవాల్సి వస్తోంది. నెలకోమారు సమావేశం, వృత్యంతర శిక్షణకు హాజరు కావాలి. స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలు, ఆడిట్‌వర్క్, ఆన్‌లైన్ సేవలు సమయాల్లో సెలవు తీసుకోవాలి. ఉపాధ్యాయుడు అవసరాల నిమితం సెలవు తీసుకుంటారు. దీంతో ఆయా సమయాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు మూసి వేయడమో, వేరే బడి నుంచి ఎంఈవో ఆదేశాల మేరకు మరొకరిని సర్దుబాటు చేయడమో చేస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత వల్ల తరగతులు అంతగా సాగడం లేదు. అందరికీ ఒకేచోట బోధిస్తే అర్థం చేసుకుని చదవడం కష్టంగా ఉంటోంది. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థుల బోధనకు ఇబ్బందులు లేకుండా గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విద్యావలంటీర్లను నియమించారు. తర్వాత కాలంలో విద్యావలంటీర్లను నియమించకపోవడంతో కష్టాలు మొదలయ్యాయి.



గోపాల్‌వాడ పాఠశాలలో ఉపాధ్యాయురాలు

ఈ చిత్రం జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడ పాఠశాల. ఇందులో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు 62మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా.. ఒకే టీచర్ విధులు నిర్వర్తిస్తున్నారు. తరగతి గదులు ఉన్నా టీచర్ల కొరతతో అన్ని తరగతులకు బోధించడం కష్టంగా మారుతోంది.

జిల్లాలో..

జిల్లాలో 166 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో కొన్నింట్లో విద్యార్థుల సంఖ్య 10లోపు ఉండడంతో ఒకే టీచర్‌తో నెట్టుకొస్తున్నారు. మరికొన్ని చోట్ల సర్దుబాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన మంచిర్యాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఒక్కరే బోధన సాగిస్తున్నారు. 23 పాఠశాలల్లో మంజూరైన 59 పోస్టుల్లో కూడా ఇంకా 19 టీచర్ల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇంకోవైపు విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నా సింగల్ టీచర్‌తో నెట్టుకు వస్తున్న పాఠశాలలూ ఉన్నాయి.

- నిర్మల్‌రోడ్ పాఠశాలలో 26 మంది విద్యార్థులున్నారు. ఇద్దరు టీచర్లను నియమించాల్సి ఉన్నా పోస్టు మంజూరు లేక ఒక్కరే పనిచేస్తున్నారు.
- మన్నె కాలనీలో 31 మంది విద్యార్థులున్నారు. ఇద్దరు టీచర్లు పనిచేయాల్సిన చోట ఒక్కరు విధులు నిర్వర్తిస్తుండగా మరో పోస్టు ఖాళీగానే ఉంది.
- పాత మంచిర్యాలలో 36 మందికి ఒక్క టీచర్‌తోనే బోధన సాగుతోంది.
- అండాలమ్మకాలనీలో 19 మంది విద్యార్థులున్నారు. రెండు పోస్టుల్లో ఒక్క ఉపాధ్యాయురాలిని నియమించగా మరో టీచర్ పోస్టు ఖాళీగానే మిగిలిపోయింది.
- రంగపేట్ పాఠశాలలో 24 మంది విద్యార్థులు చదువుతుండగా సింగిల్ టీచర్‌తోనే బోధన సాగుతోంది.
- దొరగారిపల్లిలో 20 మంది విద్యార్థులున్నారు. రెండు టీచర్ల పోస్టుల్లో ఒక్క టీచర్ పాఠాలు బోధిస్తుండడంతో కష్టాలు తప్పడం లేదు.
- రాజీవ్‌నగర్(ఓల్డ్ గర్మిళ్ల) పాఠశాలలో 91 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒకే పోస్టు మంజూరు ఉంది. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నా మరో టీచర్‌ను నియమించకపోవడంతో ఇక్కడ వేరే పాఠశాల నుంచి వర్క్ అడ్జస్ట్‌మెంట్‌తో సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్య ప్రకారం మరో టీచర్ అవసరం.

ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు, టీచర్ల నియామకంపై నిబంధనలు ఇవీ

విద్యార్థుల సంఖ్య	టీచర్లు
1-10	1
11-60	2
61-90	3
91-120	4
121-150	5
151-200	6

పక్కా భవనాలేవి..?

జిల్లా కేంద్రంలో పాఠశాలలకు పక్కా భవనాలు లేక అవస్థలు పడాల్సి వస్తోంది. జీపీఎస్ ఇస్లాంపుర ఉర్దూ మీడియం పాఠశాల ఇరుకు అద్దె గదిలో కొనసాగుతోంది. 33 మంది విద్యార్థులున్నా ఒకే టీచర్ బోధన చేస్తున్నారు.

- గోపాల్‌వాడ స్కూల్ సినిమావాడ స్కూల్‌లో రెండు తరగతి గదుల్లో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలకు పక్కనే మరో ప్రభుత్వ భవనం ఖాళీగా ఉంది. అది కేటాయిస్తే సమస్య తీరిపోనుంది.
- స్టేషన్‌రోడ్ పాఠశాలల్లో 72 మంది విద్యార్థులు అభ్యసిస్తుండగా జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగిస్తున్నారు. పక్కనే జిల్లా సైన్స్ సెంటర్‌పైన(బాయ్స్ హైస్కూల్ తరగతి గదులు) స్పోర్ట్స్, వయోజన విద్యా శాఖ కార్యాలయాలు కలెక్టర్ కార్యాలయానికి తరలిపోవడంతో ఆ గదులు కేటాయిస్తే సరిపోతుంది. బాయ్స్ హైస్కూల్‌లోనే సైకిల్‌స్టాండ్ నిర్వహించే స్థలంలో గానీ, ఎస్సీ వసతి బాలుర కళాశాల పక్కన క్రీడా మైదానంలో పాఠశాల కోసం గదులు కేటాయిస్తే సమస్య తీరనుంది. హరిజనవాడ పాఠశాలలో రాళ్లపేట్ పాఠశాల నిర్వహిస్తున్నారు. బైపాస్‌రోడ్‌లోని ఎస్‌టీపీపీ స్థలం, లేదా విద్యార్థులకు అందుబాటులో పాఠశాల గదులు నిర్మించాలని కోరుతున్నారు. రంగపేట్ పాఠశాల భవనం పూర్తయినా పాత మంచిర్యాల హైస్కూల్‌లోనే కొనసాగుతోంది.

ఉత్తమ బడి.. కిష్టాపూర్

- జిల్లా నుంచి ఎంపికైన పాఠశాల
- 23న అవార్డు ప్రదానం



కిష్టాపూర్ ఉన్నత పాఠశాల

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సమష్టి కృషి, క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాలకు గుర్తింపు లభించింది. జిల్లా నుంచి ఉత్తమ పాఠశాల అవార్డుకు రాష్ట్ర విద్యాశాఖ ఎంపిక చేసింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 518మంది విద్యార్థులు ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. యేటా 150నుంచి 200 మంది వరకు కొత్తగా చేరుతున్నారు. ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ వల్ల 2008నుంచి 2024వరకు 256మంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ఎంపికలో ఈ పాఠశాల జిల్లాలో ఐదుసార్లు మొదటి స్థానంలో నిలిచింది. ప్రతీ సంవత్సరం 10 జీపీఏ పాయింట్లతో మండల, జిల్లా స్థాయిలో పేరు తెచ్చుకుంది. ఈ ఏడాది స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి విద్యార్థి విష్ణువర్ధన్ ఎంపికై ఢిల్లీలో నిర్వహించిన స్వాతంత్య్ర ఉత్సవాల్లో పాల్గొన్నాడు. ప్రధాన మంత్రి మోదీతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరయ్యాడు. ఈ నెల 23న రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ నర్సింహారెడ్డి చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న అవార్డు అందుకోనున్నారు. ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమష్టి కృషి ఫలితం



జిల్లా నుంచి మా పాఠశాల ఉత్తమ పాఠశాల అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. తనతోపాటుగా ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాల సాధనకు చేస్తున్న సమష్టి కృషి వల్ల పేరు వచ్చింది. ఉత్తమ ఫలితాల సాధనలో జిల్లాలోనే ముందుండాలనేది మా తపన.

– గుండ రాజన్న, ప్రధానోపాధ్యాయుడు

ప్రయోగపూర్వక బోధన చేయాలి




డీఈవో యాదయ్యతో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: ప్రతీ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు ప్రయోగ పూర్వక పాఠ్యాంశ బోధన చేయాలని డీఈవో యాదయ్య సూచించారు. బుధవారం జిల్లా విద్యాశాఖ, జీవశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా సైన్స్ కేంద్రంలో జిల్లా స్థాయి జీవశాస్త్ర టాలెంట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 72 మంది విద్యార్థులు హాజరు కాగా.. విజేతలను ప్రకటించారు. తెలుగు మీడియంలో జెడ్పీహెచ్‌ఎస్ కిష్టాపూర్‌కు చెందిన అనిల్ ప్రథమ, పాక్కూర్ జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన ఐశ్వర్య ద్వితీయ, ఆంగ్ల మాధ్యమంలో జెడ్పీహెచ్‌ఎస్ గుడిరేవుకు చెందిన అంజి ప్రథమ, కలమడుగు పాఠశాలకు చెందిన అంజన్న ద్వితీయ స్థానం సాధించారు. తెలంగాణ ఆదర్శ పాఠశాల మంచిర్యాలకు చెందిన చరణ్ ప్రథమ, నక్షత్ర ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి టాలెంట్ పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు డీఈవో యాదయ్య బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మాళవిదేవీ, డీఎస్‌వో మధుబాబు, జీవశాస్త్ర ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

బకాయిలపై అసెంబ్లీలో చర్చించాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.30వేల కోట్ల బకాయిలపై అసెంబ్లీలో చర్చించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలను కోరారు. ఎస్ఆర్పీ–1 గనిపై బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కోల్‌బెల్ట్ ఎంపీలు పార్లమెంటులో సింగరేణి బకాయిలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఎన్నికల ముందు తమను గెలిపిస్తే కార్మికుల డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సంఘాలు, పార్టీలు నేడు గెలిచాక స్పందించడం లేదన్నారు. కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆదాయ పన్ను మాఫీ చేయాలని, మారుపేర్లతో పనిచేస్తున్న కార్మికుల పేర్లను క్రమబద్ధీకరించాలని అన్నారు. డిమాండ్లపై యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకుంటే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీని వాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంగళ శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, నాయకులు సిరికొండ శ్రీనివాస్, గోపాల్ రాథోడ్, నాంపల్లి సంపత్ పాల్గొన్నారు.

బల్దియాలకు కొత్త ఉద్యోగులు



మంచిర్యాలలో విధుల్లో చేరిన ఉద్యోగులు

మంచిర్యాలటౌన్: గ్రూప్–4 ద్వారా ఇటీవల నియామకమైన జిల్లాకు చెందిన ఉద్యోగులు బుధవారం వారికి కేటాయించిన మున్సిపాలిటీల్లో చేరారు. వార్డు ఆఫీసర్లుగా 79 మంది, జూనియర్ అసిస్టెంట్లుగా 10, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా 9 మందిని జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలకు కేటాయించారు. ఇందులో వార్డు ఆఫీసర్లుగా మంచిర్యాలకు 28 మంది, బెల్లంపల్లికి 9 మంది, మందమర్రికి 16 మంది, క్యాతన్‌పల్లికి 4, నస్పూర్‌కు 19 మంది, చెన్నూర్‌కు ముగ్గురిని కేటాయించారు. జూనియర్ అసిస్టెంట్లుగా 18 మందికి పోస్టింగ్ ఇవ్వగా మంచిర్యాలకు 2, బెల్లంపల్లికి 4, మందమర్రికి 2, క్యాతన్‌పల్లికి 2, నస్పూర్‌కు 4, లక్సెట్టిపేట్‌కు 3, చెన్నూరుకు 1 కేటాయించారు. జూనియర్ అకౌంటెంట్లుగా 10 మందికి పోస్టింగ్ ఇవ్వగా మంచిర్యాల మున్సిపాలిటీకి 2, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లికి ఒక్కొక్కటి చొప్పున, మందమర్రి, నస్పూర్, లక్సెట్టిపేటకు రెండు చొప్పున కేటాయించారు.

సీఎంఆర్ పూర్తి చేయాలి

- నెలాఖరు వరకే గడువు
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



గుడిపేటలో కళాశాల పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: సీఎంఆర్, పెండింగ్ బకాయిలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి జిల్లా అధికారులు, రైస్‌మిల్లర్లతో ధాన్యం సేకరణ, చెల్లింపులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైస్‌మిల్లర్లు బకాయి ఉన్న రూ.93కోట్లు వెంటనే చెల్లించాలని, ఈ నెలాఖరు వరకు నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు. లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వహిస్తున్న మిల్లులపై డిఫాల్టర్లుగా ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మయ్య, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీకళ పాల్గొన్నారు.

అర్హులకు పరిహారం

మంచిర్యాలఅగ్రికల్చర్: జాతీయ రహదారి–163జీ నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతీ ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో బాధితుల వివరాలను ఆర్డీవో శ్రీనివాస్ రావుతో కలిసి పరిశీలించారు.

పనులు వేగవంతం చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం హాజీపూర్ మండలం గుడిపేటలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య కళాశాలకు సొంత భవనాన్ని రూ.216 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ ఏఈఈ అనూష, కళాశాల ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ సంపూర్ణరావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు

- రామగుండం సీపీ శ్రీనివాస్
- వేమనపల్లిలో మెగా వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న సీపీ శ్రీనివాస్

వేమనపల్లి: అసాంఘిక శక్తులైన మావోయిస్టులకు సహకరించొద్దని, ప్రజలు ప్రశాంత జీవితాన్ని శాంతియుత వాతావరణంలో గడపడమే పోలీసు ప్రధాన లక్ష్యమని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని దస్నాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నీల్వాయి పోలీసులు ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ ప్రజలకు భరోసా కేంద్రమని, ఆదివాసీల సంక్షేమం కోసం పోలీసు శాఖ నిరంతరం పని చేస్తుందని తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా పల్లె నిద్ర కార్యక్రమాల్లో పోలీసు అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని అన్నారు. మంచిర్యాల డ్రగ్గిస్ట్, కెమిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల విలువైన మందులు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ(అడ్మిన్) రాజు, ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్, టౌన్ సీఐలు సుధాకర్, రవీందర్, ఎస్సైలు శ్యాంపటేల్, రాజేందర్,శ్రీధర్, మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్ అలీ, డ్రగిస్ట్, కెమిస్ట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆశ్రమ స్థలాన్ని అప్పగించండి

ఆక్రమణకు గురైన వేమనపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల స్థలాన్ని పాఠశాలకు ఇప్పించాలని దస్నాపూర్, కొత్తపల్లి గ్రామాల యువత, మాజీ సర్పంచ్ రమేష్, నాయకులు వెంకటేష్‌గౌడ్, స్వామి సీపీకి వినతిపత్రం అందజేశారు. కొందరు వ్యక్తులు కబ్జా చేశారని తెలిపారు. దీంతో సమస్య పరిష్కరించాలని రూరల్ సీఐ సుధాకర్‌ను ఆదేశించారు.

డీలర్లకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందుకున్న డీలర్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో నూతనంగా నమోదైన వ్యవసాయ డీలర్లకు హాజీపూర్ మండలం గుడిపేట రైతువేదికలో 48 వారాలపాటు ఇచ్చిన శిక్షణ బుధవారం పూర్తయింది. డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్(డీఏఈఎస్ఐ) ఆధ్వర్యంలో శిక్షణ ఏర్పాటు చేయగా విత్తన, ఎరువులు, పురుగుల మందుల చట్టం మేరకు క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన, వ్యాధుల నిర్ధారణ, నివారణ చర్యలు, పంటల ఉత్పత్తి, ఉత్పాదకతని పెంచేందుకు అవసరమైన శాస్త్రీయ విధానాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న డీలర్లకు పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణులకు జిల్లా వ్యవసాయాధికారి కల్పన సర్టిఫికెట్లు అందజేశారు. హాజీపూర్ వ్యవసాయాధికారి కృష్ణ, డీఏఈఎస్ఐ నిర్వాహకులు శశిధర్, డీలర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఆర్టీల సమ్మెతో మూతబడ్డ పాఠశాలలు



దర్బతండాలో మూతపడ్డ పాఠశాల

నేరడిగొండ: సీఆర్టీల సమ్మెతో ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలు మూతబడ్డాయి. దీంతో ఆ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. మండలంలోని రేంగన్‌వాడి, దర్బతండా, బుర్కపల్లి, దంషాతండా, గోవింద్‌పూర్, నంద్యనాయక్ తండా, పీచర, లక్ష్మీపూర్, అద్దాల తిమ్మాపూర్, పట్‌పట్‌తండా, ఏసుగూడ గ్రామాల్లోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలు సీఆర్టీల సమ్మెతో మూసి ఉన్నాయి. దీంతో ఆ పాఠశాలల విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీఆర్టీల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలు తెరవాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

21న బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

రామకృష్ణాపూర్: ఈ నెల 21న మంచిర్యాల జిల్లా ఏసీసీలోని శ్రీఉషోదయ హైస్కూల్ గ్రౌండ్‌లో అండర్–13, అండర్–15 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనే విద్యార్థులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9849444744 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సింగరేణి స్క్రాప్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న స్క్రాప్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ నగునూరి రవి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం బోయపల్లి, బెల్లంపల్లి తదితర ఏరియాల్లోని స్క్రాప్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రూ.40వేల విలువైన సింగరేణి స్క్రాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ స్క్రాప్ దుకాణాల్లో సింగరేణి పరికరాల క్రయవిక్రయాలు జరుపరాదని తెలిపారు. స్వాధీనం చేసుకున్న స్క్రాప్‌ను మందమర్రి ఏరియా ఎస్‌అండ్‌పీసీ ఆఫీస్‌కు తరలించారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, స్పెషల్ పార్టీ సిబ్బంది ఉన్నారు.

కవ్వాల్‌లో ఏజీపీ అధికారుల పర్యటన



సఫారీలో పర్యటిస్తున్న అధికారులు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ జన్నారం అటవీ డివిజన్‌లో అకౌంటెంట్ జనరల్ ఆడిట్ అధికారులు పర్యటించారు. పంజాబ్‌కు చెందిన పంకజ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన విజయ్‌వర్మ బుధవారం జన్నారానికి చేరుకున్నారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు ఆదేశాల మేరకు డీఆర్వో తిరుపతి, బీట్ అధికారి లాల్‌బాయి వారిని సఫారీ ద్వారా అడవుల్లోకి తీసుకెళ్లారు. గొండుగూడ బేస్‌క్యాంప్, బైసన్‌కుంట, మల్యాల వాచ్‌టవర్ వరకు సఫారీ ప్రయాణం చేశారు. వన్య ప్రాణులను చూసి మురిసిపోయారు. గడ్డి క్షేత్రాలు, నీటి కుంటల గురించి తెలుసుకున్నారు.

చలికాలం.. జర భద్రం



- 4డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఇళ్లకే పరిమితమవుతున్న జనాలు
- ఇబ్బందుల్లో చిన్నారులు, వృద్ధులు
- చలితో పంటల ఎదుగుదల లోపం
- అప్రమత్తంగా లేకుంటే అనర్థాలు

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు చలికి గజగజా వణికిపోతున్నారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్, బేల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు అత్యల్పంగా నమోదవుతున్నాయి. వారం క్రితం కనిష్ట ఉష్ణోగ్రతలు 12 నుంచి 15 డిగ్రీలుగా ఉండగా, ప్రస్తుతం 4నుంచి 6డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరుగుతోంది. పొగమంచు కురుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భిన్న వాతావరణానికి నెలవు. వానాకాలంలో వర్షాలు, వేసవిలో ఎండలు, శీతాకాలంలో చలి తీవ్రంగా ఉంటుంది. ప్రస్తుతం చల్లటి గాలులు వీస్తుండడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. అత్యవసరమైతే స్వెట్టర్లు, ఇతర రక్షణ కవచాలు ధరించి బయటకు వెళ్తున్నారు. ఉదయం, రాత్రి వేళ గ్రామాల్లో ప్రజలు చలి మంట వేసుకుంటున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశముందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. చలి కారణంగా పంటల ఎదుగుదల లోపిస్తుండగా, పశువులు కూడా ఇబ్బందులు పడుతున్నాయి.

కమ్ముకుంటున్న పొగమంచు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్ మండలం అర్లి(టి)లో గతేడాది ఉష్ణోగ్రతలు 3డిగ్రీలకు పడిపోయాయి. కాగా, ఇప్పటివరకు ఇంత తక్కువ ఉష్ణోగ్రత నమోదు కాలేదని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. తెల్లవారుజామున పొగమంచు కమ్ముకోవడంతో బయటకురాలేని పరిస్థితి ఉంటోంది. రాత్రి 6 గంటలు దాటితే జిల్లాలో చలిపంజా విసురుతోంది. గ్రామాలు, అటవీ పరిసర ప్రాంతాల్లో చలి మరింత తీవ్రంగా ఉంటోంది.

పరికరాలతో జాగ్రత్త



బెల్లంపల్లి: చలి ప్రభావం ఎలక్ట్రానిక్ పరికరాలపై పడుతుంది. సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్ వినియోగంలో కనీస జాగ్రత్తలు తప్పనిసరి. నిర్లక్ష్యం చేస్తే అవి సరిగా పని చేయవు. సెల్ చార్జింగ్ 10శాతానికి పడిపోతే వెంటనే చార్జింగ్ పెట్టుకోవాలి. చార్జింగ్ పెట్టుకునే అవకాశం లేకుంటే స్విచ్చాఫ్ చేయాలి. సెల్ చార్జింగ్ 100 శాతం కాగానే వెంటనే రిమూవ్ చేయాలి. రాత్రి పూట చార్జింగ్ పెట్టి నిద్రపోతే బ్యాటరీ హీటెక్కి చిప్ ఓవర్ హీట్‌తో డిఫాల్ట్ అవుతుంది.

– జే శేఖర్, సెల్‌ఫోన్ మెకానిక్, బెల్లంపల్లి

పశువులకు టీకా వేయించాలి



చలి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా పశువులను కొట్టాల్లో ఉంచాలి. చలి కారణంగా పాల దిగుబడి తగ్గుతుంది. పశువులకు వెచ్చదనం కోసం చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం కుక్కలకు సంబంధించి క్రాప్ సీజన్. ఎలర్జీ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. కోళ్లకు కొక్కెర వ్యాధి వస్తుంది. టీకాలు వేయించాలి.

– కిషన్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, ఆదిలాబాద్

వేడి ఆహారం తీసుకోవాలి



నిర్మల్‌చైన్‌గేట్: చలికాలం జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, చిన్నారులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. జ్వరం, జలుబు, దగ్గుతో పాటు చలి గాలులకు కండరాల నొప్పులు వచ్చే ప్రమాదముంది. ఆస్తమా వ్యాధిగ్రస్తులు బయటకు వెళ్తే ఉన్ని దుస్తులు ధరించాలి. వేడి ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ రత్నాకర్, ఫిజీషియన్, నిర్మల్

పెంపుడు కుక్కలు జాగ్రత్త



నిర్మల్‌చైన్‌గేట్: పెంపుడు కుక్కలను ఉదయం 9నుంచి సాయంత్రం 5లోపే బయటి వాతావరణంలో ఉంచాలి. కోళ్లలో ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వాటికి విటమిన్, మినరల్స్ ఎక్కువ మోతాదులో ఉండే ఆహారం అందించాలి. పాల దిగుబడి తగ్గకుండా దాన, తౌడు మిశ్రమాలు అందించాలి. – డాక్టర్ మహేశ్, పశుసంవర్ధకశాఖ అధికారి, నిర్మల్

పొగమంచుతో ప్రమాదాలు



పొగమంచు దట్టంగా కురిసే సమయంలో వీలైనంత వరకు వాహనాలు నడపకుండా ఉంటే మంచిది. మంచు ఎక్కువగా కురుస్తున్నప్పుడు సురక్షిత ప్రాంతాల్లో పార్కింగ్ చేయాలి. తప్పనిసరి పరిస్థితుల్లోనే వాహనాల్లో ప్రయాణించాలి. పొగమంచు ఎక్కువగా ఉంటే వాహనాన్ని నెమ్మదిగా నడపాలి. ఎదురుగా వచ్చే వాహన డ్రైవర్ గమనించేలా హెడ్‌లైట్స్ ఆన్ చేసి ఉంచాలి. లారీలు, బస్సులు, ఇతర వాహనాలకు ఉండే అద్దాలపై ఉన్న వైపర్లను ఆన్ ఆఫ్ చేస్తుండాలి. దీంతో మంచు కురిసినా అద్దం క్లియర్‌గా కనబడుతుంది.

– శ్రీనివాస్, జిల్లా రవాణాశాఖ అధికారి, ఆదిలాబాద్

అప్రమత్తంగా ఉండాలి



శీతాకాలంలో పిల్లలు, వృద్ధులు, గర్భిణుల పట్ల జాగ్రత్త వహించాలి. ఆరు నెలల్లోపు చిన్నారులకు రెండు, మూడురోజులకోసారి స్నానం చేయించాలి. స్వెట్టర్లు, చేతికి గ్లౌస్‌లు, తలకు టోపీ ధరించాలి. వృద్ధులు, గర్భిణులు ఉదయం పూట వాకింగ్ చేయకుండా ఇంట్లోనే ఉండటం మంచిది. జలుబు, దగ్గు ఉన్నవారు గోరువెచ్చని నీళ్లు తాగాలి. యాంటీబయాటిక్ మందులు వాడకూడదు. అవసరమైతే వైద్యుల సూచన మేరకే వినియోగించాలి. అస్తమా, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ హేమలత, అసోసియేట్ ప్రొఫెసర్, రిమ్స్

పంటల్లో ఎదుగుదల లోపం



నవంబర్, డిసెంబర్‌లో పంటల ఎదుగుదల లోపిస్తోంది. నేల నుంచి పోషకాలు మొక్కలు తీసుకోలేని పరిస్థితి ఉంది. దీంతో మొక్కల ఆకులు పండుబారి ఎదుగుదల నిలిచిపోతుంది. శనగ, జొన్న, మక్క, గోధుమ, పెసర, వరి తదితర పంటలకు నీటిలో కరిగే ఎరువు (19:19:19 లేదా 20:20:20 లేదా 13:0:45) వేయాలి. సూక్ష్మధాతులు స్ప్రే చేయాలి. జింక్, ఇనుము, బోరాన్ లోపాలు వస్తే నివారణకు ఫార్ములా–4, ఫార్ములా–6 అగ్రోమిన్ మొక్కల ఎదుగుదలను బట్టి 350నుంచి 500 గ్రాముల వరకు పిచికారీ చేయాలి.

– శ్రీధర్ చౌహాన్, వ్యవసాయ శాస్త్రవేత్త, ఆదిలాబాద్

జీవన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీదర్శన్

భైంసా: ఉన్నత విద్యను అభ్యసించే ప్రతీ విద్యార్థి జీవన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీదర్శన్ సూచించారు. బుధవారం బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు 'బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీదర్శన్ మాట్లాడారు. ప్రతీ విద్యార్థి తమకు తాముగా ఎదగాలని, బలమైన ఆలోచనలు, ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని సూచించారు. విజయం సాధించడంలో వ్యక్తిగత పాత్ర కీలకమని చెప్పారు. ప్రవర్తన ప్రత్యేకమున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఎలా రాణించాలనే విషయాలపై ప్రతీ విద్యార్థి ముందస్తుగా ఆలోచించి అందుకు తగ్గట్లు నడుచుకోవాలన్నారు. ఒత్తిడిని సమర్థవంతంగా జయించడం, ఎలాంటి పరిస్థితుల్లోనూ సహనాన్ని కోల్పోకుండా ఉండడం అనే అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. గొప్పవ్యక్తులు రాణించిన తీరు, వారి జీవన విధానాలను తెలుసుకుని అలాంటి మార్గంలోనే నడుచుకోవాలని చెప్పారు. సరైన ఆలోచన విధానం, వ్యూహాలతో ముందుకువెళ్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఏవో రణధీర్‌సాగి, డాక్టర్ విఠల్, కౌన్సిలర్ నాగలక్ష్మి, శ్రీలక్ష్మి, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య



గెడాం శంకర్ (ఫైల్)

తాంసి: పంటచేనులో పురుగుల మందు పిచికారీ చేయడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఆతర్వాత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భీంపూర్ మండలం గోముత్రిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోముత్రి గ్రామానికి చెందిన గెడాం శంకర్ (37) ఈ నెల 12వ తేదీన తన పంటచేనులో కుమారుడితో కలిసి పురుగుల మందు పిచికారీ చేయడానికి వెళ్లాడు. మందు పిచికారీ చేసిన తర్వాత మధ్యాహ్న సమయంలో కుమారుడిని మిగతా మందు పిచికారీ చేయమని చెప్పి చెట్టు కింద కూర్చున్నాడు. కుమారుడు పని పూర్తి చేసుకుని చెట్టు దగ్గరకు రాగా తండ్రి కనిపించలేదు. చుట్టుపక్కలా, బంధువుల్లో ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఈ నెల 14వ తేదీన భీంపూర్ పోలీస్‌స్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదని శంకర్ భార్య పుష్ప ఫిర్యాదు చేసింది. కాగా, పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం అందర్‌బంద్ గ్రామశివారులోని జెండగూడ ప్రాజెక్ట్ సమీపంలో శంకర్ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శంకర్ మృతదేహంగా గుర్తించి అతడి భార్యకు పుష్పకు సమాచారం అందించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భీంపూర్ కలీం తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



చిన్న భూమన్న (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన చాకటి చిన్న భూమన్న (50) అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న భూమన్న ఈనెల 5నుంచి కనిపించడం లేదంటూ 8వ తేదీన అతడి భార్య భారతి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం కుస్లి గ్రామ శివారులోని ఊరగుట్టపై గల టేకుచెట్టు కొమ్మకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు వేణుగోపాల్ ఘటనాస్థలానికి వచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. అనారోగ్య సమస్యతో భూమన్న ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

కడెం: అనుమానాస్పదంగా ఒకరు మృతి చెందారు. ఈ ఘటన కడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని (ఖానాపూర్ మండలంలో) సింగాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సింగాపూర్ గ్రామానికి చెందిన మచ్చ పరమేశ్వర్ (35) ఈనెల 17న రాత్రి తన బెడ్రూంలో ఒక్కడే నిద్రించాడు. తెల్లవారి కుటుంబ సభ్యులు చూడగా అనుమానాస్పదంగా మరణించి కనిపించాడు. అతడి భార్య దేవిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా శివారు ప్రాంతంలోని జాతీయ రహదారి–44పై గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి–44పై గుర్తు తెలియని మృతదేహం కనిపించింది. వయస్సు 35–40 ఏళ్లు ఉంటుంది. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712659924 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యువకుడిపై కేసు

దండేపల్లి: ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం., ఏవో అంజిత్ ఈనెల 14న మండలంలోని కొత్తమామిడిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడుతున్న క్రమంలో అక్కడే ఉన్న గ్రామానికి చెందిన నలిమెల సుధాకర్ అలియాస్ సుధీర్ ఏవో విధులకు ఆటంకం కలిగించాడు. అతడిని బూతులు తిట్టి చంపుతానని బెదిరించాడు. దీంతో ఏవో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై వివరించారు.

ముళ్లపందులను తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

నిర్మల్‌టౌన్: నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ బైపాస్ వద్ద ముళ్లపందులు తరలిస్తున్న ఇద్దరిని బుధవారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఎఫ్ఆర్వో రామకృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన పుట్ట విజయ్, నాగరాజు దిలావర్‌పూర్ అటవీ ప్రాంతంలో ముళ్లపందులు చంపి జిల్లా కేంద్రంలో విక్రయించడానికి వచ్చారు. కాగా, ముందస్తు సమాచారం మేరకు కొండాపూర్ బైపాస్ వద్ద ఫారెస్ట్ అధికారులు వారి బైక్‌ను ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న సంచిలో ముళ్లపందులను గుర్తించారు. బైక్ జప్తు చేసి వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. అటవీశాఖ అధికారులు అనిత, సంతోష్‌కుమార్, ఇర్ఫాన్, నజీర్‌ఖాన్, శ్వేత, సుధాకర్ ఉన్నారు.

ఒకరికి ఏడాది జైలు

ఆసిఫాబాద్: రోడ్డు ప్రమాదంలో కారుతో ఢీకొని ఒకరి మృతికి కారణమైన రెబ్బెన మండలం ఖైర్‌గాంకు చెందిన మానెం విజయ్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జక్కుల అనంతలక్ష్మి బుధవారం తీర్పు చెప్పినట్లు రెబ్బెన ఎస్సై బుద్దెస్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బజార్‌వాడిలో నివాసముంటున్న పడిగెల విజయ్‌కుమార్ 2019 సెప్టెంబర్ 30న రాత్రి 11.00 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు వెళ్తున్న తన భార్య అరుణను కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ట్రెయిన్ ఎక్కించి ద్విచక్ర వాహనంపై ఆసిఫాబాద్‌కు తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఖైర్‌గాం సమీపంలో ఎదురుగా కారులో అతివేగంగా వస్తున్న మానెం విజయ్ ఢీకొనడంతో మోటార్‌సైకిల్‌పై ఉన్న పడిగెల విజయ్‌కుమార్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎలిశ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువవడంతో న్యాయమూర్తి పై తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు, పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బెల్లంపల్లి: పట్టణంలోని పేకాట స్థావరంపై బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ పరిధి కన్నాల బస్తీలో ఏలూరి రవి ఇంట్లో పేకాడుతున్నట్లు సమాచారం అందుకుని ఆకస్మికంగా దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లు, నిర్వాహకుడు రవిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.10,610 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను వన్‌టౌన్ పోలీసులకు అప్పగించామని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై లచ్చన్న, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా నాసిరకం సరుకుల విక్రయాలు



ఇచ్చోడలోని స్వీట్ హౌస్‌లకు సరఫరా చేస్తున్న వస్తువులు

ఇచ్చోడ: నియోజకవర్గంలోని ఇచ్చోడ, నేరడిగొండ, బజార్‌హత్నూర్, సిరికొండ, గుడిహత్నూర్, బోథ్ మండలాల్లోని పలు రాజస్థాన్ స్వీట్‌హౌస్‌లకు ఆర్మూర్ ప్రాంతానికి చెందిన మరో రాజస్థాన్ వ్యాపారి నాసిరకం సరుకులు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో కొందరు స్థానికులు అడ్డుకోవడంతో నాసిరకం సరుకులు సరఫరా చేసే వ్యక్తులు వాహనంతో పరారయ్యారు. కొద్దిరోజులుగా ఈ దందా గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఆరు మండలాల్లో కొంతకాలంగా రాజస్థాన్‌కు చెందిన స్వీట్‌హౌస్‌లు, బేకరీల వ్యాపారులు నాసిరకం సరుకులు దిగుమతి చేసుకుని వాటితో తయారు చేసిన స్వీట్లు, ఇతర ఆహార పదార్థాలు సామన్య, మధ్యతరగతి ప్రజలకు అంటగట్టి భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. స్వీట్ హౌస్‌లు, బేకరీల్లో తనిఖీలు నిర్వహించకపోవడం కూడా వారికి కలిసివస్తోంది. సంబంధిత అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేస్తే అసలు విషయం బయటకు పడే అవకాశముంది. నాసిరకం సరుకుల సరఫరాపై ఆదిలాబాద్ ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌ను వివరణ కోరగా, ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి శాంపిళ్లు సేకరించనున్నట్లు తెలిపారు.

వైభవంగా నాగోబా ఆలయ వార్షికోత్సవం



గర్భగుడిలో పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఆదివాసీ ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయ మూడో వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. పిప్రి గ్రామానికి చెందిన కొడప వినాయక్‌రావ్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మెస్రం వంశీయులతో పాటు భక్తులు తరలి వచ్చి నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సప్తాహ కార్యక్రమంలో కుమ్ర దత్త మహరాజ్, మెస్రం వంశం ప్రధాన్ పెద్దల ఆధ్వర్యంలో నాగోబా ఆలయ చరిత్ర, మెస్రం వంశీయుల చరిత్ర వివరించారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం చిన్నుపటేల్, దేవ్‌రావ్, శేఖర్‌బాబు, దాదారావ్, కోసేరావ్, షేక్‌నాథ్, జంగు, బాదిరావ్, నాగ్‌నాథ్, తుకారాం, ఆనంద్‌రావ్ తదితరులున్నారు.

ఆప్ నాయకుడిపై దాడి



దాడిలో గాయపడ్డ నయీమ్ పాషా

నస్పూర్: ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సామాజిక కార్యకర్త నయీమ్ పాషాపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చారు. ఈ ఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్లడ్ కాలనీలోని నయీమ్ ఇంటికి బుధవారం ఉదయం సుమారు 11 గంటల ప్రాంతంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆప్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్‌తో తమకు బాగా పరిచయముందని తెలిపారు. తమకు తాళ్లపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో భూసమస్య ఉందని పేర్కొన్నారు. దాని విషయంలో తమకు సహకరించాలని కోరారు. దీంతో నయీమ్ మొదట నిరాకరించి తదుపరి వారి బలవంతం మేరకు అంగీకరించాడు. వారితో బయలు దేరి వెళ్లాడు. తాళ్లపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కమాన్ వద్దకు చేరుకోగా అప్పటికే అక్కడ వేచి ఉన్న ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు, వెంట వచ్చిన ఇద్దరు కలిసి వైఖరి మార్చుకోవాలని నయీమ్‌ను హెచ్చరిస్తూ బండరాయితో దాడి చేశారు. అటుగా వస్తున్న జనాలను చూసి నయీమ్ మొబైల్ తీసుకుని పారిపోయారు. నయీం నస్పూర్ పీహెచ్‌సీకి వెళ్లి ప్రథమ చికిత్స అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్సై సుగుణాకర్‌ను సంప్రదించగా నయీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్ నయీమ్‌పై జరిగిన దాడి ఘటనను ఖండించారు. పోలీసులు విచారణ చేపట్టి నిందితులను గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయస్థాయిలో మెరిసిన ఆర్టీసీ కానిస్టేబుల్



తిరుపతిని సన్మానిస్తున్న సోలోమన్

ఆదిలాబాద్: మంచిర్యాల ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుపతి జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా పబ్లిక్ బస్ ట్రాన్స్‌పోర్ట్ అథ్లెటిక్స్ మీట్‌లో 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు. జాతీయ స్థాయి పోటీలో విజేతగా నిలవడంతో తిరుపతిని బుధవారం ఆదిలాబాద్ ఆర్‌ఎం కార్యాలయంలో ఆర్‌ఎం సోలోమన్ సన్మానించారు. డిప్యూటీ ఆర్‌ఎంలు ప్రణీత్, ప్రవీణ్‌కుమార్, ఏవో శంకరయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్ శివదాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

భీమిని: మల్లీడి పంచాయతీ పరిధి దుబ్బగూడెం గ్రామంలో బుధవారం గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలో ఇంటర్ చదువుతున్న ఒగ్గు అంజన్న (మైనర్ బాలుడు)కు బస్సులో దుబ్బగూడెం గ్రామానికి చెందిన అకుల హరీశ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఇరువురు సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించేందుకు ప్లాన్ వేశారు. దుబ్బగూడెంలోని హరీశ్ ఇంటి పెరట్లో రెండు గంజాయి మొక్కలు నాటారు. రెండు నెలల తర్వాత వీరు గంజాయి మొక్కలను అమ్మడానికి తీసుకువెళ్తున్న క్రమంలో నార్కోటిక్ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి దుబ్బగూడెం గ్రామ శివారులో పట్టుకున్నారు. ఇద్దరి నుంచి 240 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.